క్లుప్తంగా

ఢిల్లీకి మట్టి



మట్టి కళశాన్ని ఎంపీడీఓకు అందజేస్తున్న గ్రామసర్పంచ్, సచివాలయ సిబ్బంది

ఉయ్యాలవాడ : నా మట్టి – నా దేశం కార్యక్రమంలో భాగంగా మండలంలో ప్రతి గ్రామ గ్రామం నుంచి మట్టిని సేకరించి ఢిల్లీకి పంపేందుకు ఏర్పాటు చేస్తున్నట్లు ఎంపీడీఓ ఉమామహేశ్వరరావు బుధవారం తెలిపారు. ఈ మేరకు మండల కేంద్రం సర్పంచ్ ఓబులేస్, మహిళా పోలీస్ సరస్వతి, పంచాయతీ కార్యదర్శి జయరామిరెడ్డి, ఏపీఓ రవిప్రకాష్ మట్టి కళశాన్ని బుధవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో అందజేశారు.

సీసీ రోడ్ల పనులు ప్రారంభం

చాగలమర్రి: మండలంలోని పెద్దబోధనం గ్రామంలో రూ.10 లక్షల గడప గడపకు మన ప్రభుత్వం నిధులతో గ్రామంలో రెండు చోట్ల సీసీ రోడ్ల పనులు చేపట్టినట్లు గ్రామ సర్పంచ్ ముడియం శివమ్మ బుధవారం తెలిపారు. వంగాల వెంకటేశ్వరరెడ్డి ఇంటి నుంచి సచివాలయానికి వెళ్లే రోడ్డు వరకు రూ.5లక్షలతో, ఎస్సీ కాలనీలో ఎస్ఎస్ ట్యాంకు నుంచి దండు పుల్లయ్య ఇంటి వరకు రూ.5 లక్షల వ్యయంతో పనులు చేపట్టినట్లు వివరించారు.

సోయాకు పల్లాకు తెగులు

నంద్యాల(అర్బన్): .మండలంలోని గ్రామాల్లో ఖరీఫ్‌లో భాగంగా రైతులు సాగు చేసిన సోయా చిక్కుడుకు పల్లాకు తెగులు సోకిందని ఆర్ఏఆర్ఎస్ కీటక విభాగ శాస్త్రవేత్త డాక్టర్ శివరామకృష్ణ తెలిపారు. తెగులు నివారణకు ఫ్రైడ్-0.2గ్రాములు/లీ, ట్రైజోపాస్ - 2గ్రా/లీ, అసిఫేట్-1.5గ్రా/లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలన్నారు. పంటల పరిశీలనలో భాగంగా బుధవారం ఆర్ఏఆర్ఎస్ దత్తత గ్రామమైన పులిమద్దిలో పరిశోధనా స్థానం శాస్త్రవేత్తలు పలు పంటలను పరిశీలించారు. అనంతరం గ్రామ రైతు భరోసా కేంద్రంలో నిర్వహించిన రైతుల సమావేశంలో శాస్త్రవేత్త మాట్లాడుతూ సోయా చిక్కుడులో తెల్లదోమ ఉధృతిని అరికట్టేందుకు పసుపు రంగు జిగురు అట్టలు ఎకరాకు 30–40 అమర్చుకోవాలని సూచించారు. గ్రామపెద్దలు, రైతులు, వీఏఏ సురేష్ రెడ్డి పాల్గొన్నారు.

నిరుద్యోగులకు 'ఉన్నతి' ద్వారా ఉపాధి

ఉయ్యాలవాడ : మండలంలో ఉపాధి హామీ పథకం కింద 65 కుటుంబాలు వంద రోజుల పనిదినాలు పూర్తి చేశాయని ఏపీఓ రవిప్రకాష్ బుధవారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ వంద రోజులు పూర్తి చేసిన కుటుంబాల్లోని 19-35 సంవత్సరాల మధ్య వయస్సు కలిగి వుండి డిగ్రీ ఉత్తీర్ణత సాధించిన వారికి ఉన్నతి ద్వారా ఉపాధి అవకాశాలు కల్పిస్తామని చెప్పారు. ఈ మేరకు ఆయా కుటుంబాల్లోని డిగ్రీ పూర్తి చేసిన వారిని ఈ నెల 18వ తేదీ లోగా గుర్తించి కర్నూలు సమీపంలోనున్న తాండ్రపాడు శిక్షణ కేంద్రానికి పంపుతామని తెలిపారు. మూడు నెలల శిక్షణ అనంతరం వారికి అపోలో మెడికల్ ఫార్మసీలో సేల్స్ సూపర్‌వైజర్‌గా ప్రాధాన్యత ఇస్తారని వివరించారు.

కాంట్రాక్ట్ అధ్యాపకులు రెన్యూవల్ చేయించుకోవాలి

నంద్యాల(న్యూటౌన్): ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గత సంవత్సరం నుంచి పనిచేస్తున్న కాంట్రాక్టు అధ్యాపకులు, డిస్టర్బ్ అయిన కాంట్రాక్ట్ అధ్యాపకులు ఈ నెల 19వ తేదీ లోపు రెన్యూవల్ చేయించుకోవాలని నంద్యాల ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శశికళ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆమె మాట్లాడుతూ 10వ తరగతి మార్క్స్ మెమో, బయోడేటా, బదిలీ పత్రంతో తాము పనిచేస్తున్న కళాశాల ప్రిన్సిపాల్‌కు అందజేయాలని సూచించారు. అలాగే 23 వ తేదీన నంద్యాల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కౌన్సెలింగ్(ఎన్ఆర్సీ)కు హాజరు కావాలని చెప్పారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

ఉయ్యాలవాడ : స్థానిక బండ్లకోన సమీపంలో నున్న ఓ సత్రంలో పేకాట ఆడుతున్న 11 మందిని బుధవారం అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ సత్యనారాయణ తెలిపారు. పేకాటాడుతున్నారనే సమాచారం మేరకు సిబ్బందితో కలిసి సత్రంపై దాడి చేసి 11 మందిని అదుపులోనికి తీసుకుని వారి నుంచి రూ.1.43 లక్షల నగదు, పేక ముక్కలు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ వివరించారు.

పొలంబడిపై అవగాహన

దొర్నిపాడు: పత్తి పంటలో 14వారాల పాటు నిర్వహిస్తున్న పొలంబడి కార్యక్రమంపై మండల వ్యవసాయాధికారి సునీత రైతులకు బుధవారం అవగాహన కల్పించారు. ఆమె మాట్లాడుతూ మొదటి వారంలో రైతు పొలాన్ని ఎంపిక చేసి ఐసీఎం ప్లాట్, ఫార్మర్ ప్లాట్, ప్రయోగాత్మక ప్లాట్లుగా విభజిస్తామన్నారు. అనంతరం మట్టి నమూనాలు సేకరించి వాటి ఫలితాలపై విశ్లేషిస్తామన్నారు. మండలంలోని క్రిష్టిపాడు గ్రామంలో జరుగుతున్న ఈ-క్రాప్ నమోదుపై అవగాహన కల్పించారు.

అధిక దిగుబడి సాధించాలి

గోస్పాడు: రైతులు తక్కువ పెట్టుబడితోట్టి అధిక దిగుబడులు సాధించే పద్ధతులను అవలంభించాలని వ్యవసాయాధికారి స్వప్నిక సూచించారు. మండలంలోని నెహ్రూ నగర్ గ్రామంలో బుధవారం డాక్టర్ వైఎస్సార్ పొలంబడి కార్యక్రమం నిర్వహించారు.

కాసరతో ఆరోగ్యం మెండు

- మార్కెట్‌లో విస్తారంగా కాసరకాయలు
- మధుమేహం రోగులకు మేలంటున్న వైద్యులు
- ఫైల్స్, మలబద్ధకం నివారణకూ..
- కిలో రూ.200కు పైగా విక్రయం
- కొనేందుకు జంకుతున్న జనం



కాసరకాయలను కొనుగోలు చేస్తున్న దృశ్యం

నంద్యాల(వ్యవసాయం): వర్షాలు మొదలయ్యాయంటే చాలు.. పల్లెల్లోని బీడు భూముల్లో కాసర కాయలు విస్తారంగా కాసేవి. గతంలో వీటిని కేవలం పల్లెవాసులు మాత్రమే ఆహారంగా తీసుకునేవారు. అయితే రాను రాను పట్టణాలకు విస్తరించింది. ముఖ్యంగా మధుమేహ వ్యాధిగ్రస్తులకు చేదుగా ఉండే కాసర కాయలు ఎంతో మేలు చేస్తాయని వైద్యులు సైతం సూచిస్తుండటంతో వీటి కొనుగోళ్లు పెరిగాయి. కాసర కాయలను ఆహారంగా తీసుకోవడం వల్ల ఆరోగ్యానికి ఎంతో మంచిదని నిపుణులు పేర్కొంటున్నారు. అలాగే బీడు భూములు తగ్గిపోవడం, పంట లేకపోవడంతో ప్రస్తుతం ఇతర ప్రాంతాల నుంచి దిగుమతి చేసుకొని విక్రయిస్తున్నారు. ప్రస్తుతం మార్కెట్‌లో విస్తారంగా లభిస్తున్నాయి. అయితే కిలో ధర రూ.250 వరకు విక్రయిస్తుండటంతో సామాన్యులు కొనుగోలకు వెనకడుగు వేస్తున్నారు. వీటిని కొని శుభ్రం చేసుకునే సరికి దాదాపు పావు కిలో తగ్గుతాయని ఆ లెక్కన కిలో రూ.300 పైగా పడినట్లేనంటున్నారు.

ఆరోగ్య ప్రయోజనాలు..

కాసరకాయలు చేదు గుణం కలిగి ఉంటాయి. ముఖ్యంగా సహజసిద్ధంగా లభిస్తుండటంతో పాటు సుగర్ వ్యాధిని అదుపులో ఉంచే గుణం ఉండటంతో వైద్యులు సైతం వీటిని ఆహారంలో చేర్చుకోమని సూచిస్తున్నారు. అలాగే ఫైల్స్, మలబద్ధకంతో బాధ పడుతున్న వారికి ఇవి ఎంతో ఉపయోగకరమంటున్నారు. అందుకు కారణం అధికంగా పీచును కలిగి ఉండటమేనని వైద్య నిపుణులు పేర్కొంటున్నారు.

ఇతర ప్రాంతాల నుంచి దిగుమతి..

గతంలో కోవెలకుంట్ల, ఉయ్యాలవాడ, అవుకు, బనగానపల్లె తదితర ప్రాంతాల్లోని నల్లరేగడి పొలాల్లో కాసరకాయలు అధికంగా పండేవి. రైతులు కూడా అప్పట్లో ఉచితంగా ఇచ్చేవారు. అయితే వీటికి కూడా డిమాండ్ పెరగడంతో వాణిజ్య పంటగా మారింది. ప్రస్తుతం కాసరకాయలను అవుకు, బనగానపల్లె, కోవెలకుంట్ల, అనంతపురం, కర్ణాటక రాష్ట్రంలోని హుబ్లీ, గిద్దలూరు తదితర ప్రాంతాల నుంచి వ్యాపారులు దిగుమతి చేసుకుంటారు. రోజుకు పట్టణానికి పది నుంచి 12 క్వింటాళ్ల కాసర కాయలు వస్తున్నాయని ఇందులో 50 శాతం పట్టణం మొత్తం మీద విక్రయిస్తే ఎస్‌బీఐ, ఎన్‌జీఓ కాలనీలు, సంజీవనగర్, పద్మావతినగర్, శ్రీనివాససెంటర్, బాలాజీ కాంప్లెక్స్ తదితర కాలనీల్లో మిగిలిన 50 శాతం కాసరకాయలు అమ్ముడవుతాయని వ్యాపారులు చెబుతున్నారు. కాసర కాయలను దిగుమతికి అధికంగా ఖర్చవుతుందని, రవాణా చార్జీలు కూడా ఎక్కువగా ఉన్నాయని దీంతో ధర అధికంగా ఉందంటున్నారు. బనగానపల్లె, అవుకు తదితర ప్రాంతాల నుంచి వచ్చే వాటి ధర ఎక్కువగా ఉండటంతో తమకు గిట్టుబాటు కాదని వ్యాపారులు కర్ణాటక ప్రాంతాల నుంచి తెప్పించుకుంటున్నారు. అక్కడ కిలో రూ.60 నుంచి రూ.80 లోపు లభిస్తుందని, ఇక్కడ మాత్రం రూ.120 వరకు ఇవ్వాల్సి వస్తుందని చెబుతున్నారు. గతంలో తోపుడు బండిపై వేసుకొని నాలుగైదు గంటలు తిరిగితే అమ్మకం పూర్తయ్యేదని, ధర ఎక్కువగా ఉండటంతో 10 కి.మీ. తిగిరిగా పూర్తిగా అమ్ముకోలేక పోతున్నామని నిర్వాహకులు పేర్కొంటున్నారు.

ధరలు అధికంగా ఉన్నాయి



కాసర కాయలు కొందామంటే ధరలు అధికంగా ఉండటంతో వెనుకాడుతున్నాం. కానీ ఆరోగ్యానికి మంచిదని, కొనక తప్పడం లేదు. కేజీ రూ.200కు పైగా అమ్ముతుండటంతో పావుకేజీతో సరిపెట్టుకుంటున్నాం.

– జయన్న, బిల్లలాపురం, నంద్యాల

ఇతర ప్రాంతాల నుంచి దిగుమతి చేసుకుంటున్నాం

ఇతర ప్రాంతాల నుంచి కాసరకాయలను తెప్పించుకోవడంతో అధిక ధరలకు అమ్ముకోవాల్సి వస్తుంది. ధర ఎక్కువగా ఉండటంతో కొంత మంది కొనడానికి ముందుకు రావడం లేదు. ఇవి రెండు రోజులు అయితే కుళ్లిపోతాయి. కనీసం గిట్టుబాటు కూలి కూడా రావడం లేదు.

– హుసేన్‌బాషా, వ్యాపారి

ఆరోగ్యానికి చాలా మంచిది

కాసరకాయ మధుమేహ వ్యాధిగ్రస్తులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. మధుమేహం అదుపులో ఉండటానికి కాసర కాయలు బాగా పనిచేస్తాయి. మలబద్ధకానికి, ఫైల్స్ వ్యాధి గ్రస్తులు వీటిని తింటే చాలా మంచిది.

– డాక్టర్ చిట్టిబొట్ల భరద్వాజ, ఆయుర్వేద వైద్యుడు

ప్రభుత్వ నిర్ణయం హర్షణీయం

గోస్పాడు: ఒప్పంద ఉద్యోగులు, అధ్యాపకుల విషయంపై ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం హర్షణీయమని కాంట్రాక్ట్ లెక్చరర్ జేఏసీ సంఘం నాయకుడు అబ్దుల్ జబ్బార్ పేర్కొన్నారు. బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఒప్పంద ప్రాతిపదికపై పనిచేస్తున్న వారందరినీ రెగ్యులర్ చేసేందుకు ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడంపై ఆనందం వ్యక్తం చేశారు.

పోలింగ్‌కు ఏర్పాట్లు పూర్తి

శిరివెళ్ల: మండలంలో ఈ నెల 19వ తేదీన జరగనున్న రెండు వార్డుల ఉప ఎన్నికల పోలింగ్‌కు ఏర్పాట్లు పూర్తియయ్యాయని ఎంపీడీఓ సుబ్రహ్మణ్యం బుధవారం తెలిపారు. యర్రగుంట్ల మేజర్ గ్రామ పంచాయతీ 8వ వార్డులో 387 మంది ఓటర్లు ఉన్నారని, వారికి జెడ్పీ ఉన్నత పాఠశాలలో పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేశామన్నారు. కేంద్రానికి నలుగురు పోలింగ్ సిబ్బందిని నియమించామని చెప్పారు. అలాగే వనికిదినిదిన్నెలోని 5 వార్డులో 97 మంది ఓటర్లుండగా, వారికి ప్రాథమికోన్నత పాఠశాలలో పోలింగ్ కేంద్రం ఏర్పటు చేశామన్నారు. అదే రోజు ఓట్ల లెక్కింపు ఉంటుందని వివరించారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో జైలు శిక్ష

నంద్యాల(వ్యవసాయం): మద్యం సేవించి వాహనం నడుపుతూ పట్టుబడిన యువకుడికి సెకెండ్ క్లాస్ మేజిస్ట్రేట్ రామిరెడ్డి గారి రాంభూపాల్‌రెడ్డి జైలు శిక్ష ఖరారు చేసిట్లు కోర్టు పోలీసులు తెలిపారు. నంద్యాల పట్టణంలో డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలు నిర్వహిస్తుండగా మద్యం సేవించి వాహనం నడుపుతున్న బండి ఆత్మకూరు మండలం సిద్ధవరం గ్రామానికి చెందిన కూసు నాగిరెడ్డి అనే యువకుడిని అదుపులోనికి తీసుకుని కోర్టులో హాజరుపరచగా నాలుగు రోజుల పాటు జైలు శిక్ష విధిస్తూ ఉత్తర్వులు జారీచేశారన్నారు.

బాధిత కుటుంబాన్ని ఆదుకుంటాం



మృతుడి కుటుంబ సభ్యులకు నగదు, బీమా పత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే



టీడీపీ నుంచి తిరిగి వైఎస్సార్‌సీపీలో చేరిన వారితో ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి

ఆళ్లగడ్డ: ప్రమాదవశాత్తు పై కప్పు నుంచి కింద పడి మృతి చెందిన అసంఘటిత కార్మికుడు బికారిగారి సయ్యద్‌బాషా కుటుంబాన్ని అన్ని విధాలుగా ఆదుకుంటామని ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి తెలిపారు. స్థానిక ఎమ్మెల్యే కార్యాలయంలో బుధవారం మృతుడు జి.జమ్మలదిన్నె గ్రామానికి చెందిన సయ్యద్‌బాషా కుటుంబ సభ్యులకు తక్షణ సాయంగా రూ.10 వేల నగదు అందజేశారు. ప్రభుత్వం తరుపున రూ 5 లక్షల బీమా మంజూరవుతుందని, ఇందుకు సంబంధించిన పత్రాలను అందజేశారు. కుటుంబానికి అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ఎంపీపీ గజ్జల రాఘవేంద్రారెడ్డి ఉన్నారు.

మళ్లీ సొంత గూటికి

మాయమాటలు నమ్మి టీడీపీలో చేరిన నాయకులు ఒక్క రోజులోనే తప్పును తెలుసుకొని మళ్లీ వైఎస్సార్‌సీపీ గూటికి చేరారు. చాగలమర్రి మండలం బ్రాహ్మణపల్లి గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకులు మంగళవారం టీడీపీలో చేరా రు. అయితే ఇంటికి వచ్చిన వెంటనే గ్రామస్తులు, కుటుంబ సభ్యులు పరిస్థితిని వివరించడంతో..తాము మాయమాటలకు మోసపోయామని మళ్లీ తిరిగి వైఎస్సార్‌సీపీలో చేరుతామని చెప్పడంతో మండల నాయకుడు కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో టీడీపీలో చేరిన రామకృష్ణారెడ్డి, అయ్యల రవి, బాబు, శోభన్ బాబును బుధవారం ఎమ్మెల్యే కార్యాలయానికి తీసుకొచ్చారు. ఎమ్మెల్యే వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. నాయకులు శ్రీనివాసరెడ్డి, కిరణ్‌కుమార్‌రెడ్డి, లక్ష్మిరెడ్డి, శేషు, రమేష్ ఉన్నారు.

గడప గడపలో వెల్లివిరుస్తున్న సంతోషం

- అర్హులందరికీ సంక్షేమపథకాలు
- ఎమ్మెల్యే శిల్పా రవిచంద్ర కిశోర్‌రెడ్డి
- నంద్యాల 38వ వార్డులో 'గడప గడపకు మన ప్రభుత్వం'



మహిళకు పథకాల వివరించి బుక్‌లెట్ అందజేస్తున్న ఎమ్మెల్యే శిల్పా రవి

నంద్యాల(సిటీ): సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందజేస్తున్న నవరత్నాలు పథకాలతో ప్రతి గడపలో సంతోషం వెల్లివిరిస్తోందని ఎమ్మెల్యే శిల్పా రవిచంద్ర కిశోర్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం పట్టణంలోని 38వ వార్డు వైఎస్సార్ నగర్‌లో వార్డు ఇన్‌చార్జ్ టీవీ.రమణ, కౌన్సిలర్ సావిత్రమ్మతో కలిసి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రతి ఇంటికీ తిరిగి లబ్ధి పొందిన పథకాలను వివరించి, బుక్‌లెట్‌లు అందజేసి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ.. ప్రతి ఇంట్లో సంతోషం నింపడమే లక్ష్యంగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పని చేస్తుందని చెప్పారు. కేవలం ఎన్నికల సమయంలో ఓట్ల కోసం తమ గృహాల వద్దకు వచ్చే నాయకులకు మరోమారు బుద్ధి చెప్పాలని స్థానికులకు సూచించారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను 98 శాతానికి పైగా అమలు చేసిన ఏకైక నాయకుడు సీఎం జగనన్న మాత్రమేనన్నారు. ఓట్ల కోసం కాకుండా ప్రజాసేవ కోసం రాజకీయాలు చేస్తున్న ఏకైక పార్టీ వైఎస్సార్‌సీపీ మాత్రమేనన్నారు. పేదల మద్దతుతో ఏర్పడిన ప్రభుత్వాన్ని పెత్తందారీలు నాశనం చేయాలని చూస్తున్నారని, వారి మయమాటలు నమ్మొద్దన్నారు. సంక్షేమ పథకాలు కొనసాగాలంటే మరోసారి జగనన్నను సీఎంగా చేసుకుందామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ వెంకటదాసు,నాయకులు అంకాలయ్య, తిరుపతయ్య, పుల్లమ్మ, రామకృష్ణారెడ్డి, ప్రసాద్‌రెడ్డి, అన్వర్‌బాషా, బాబురావు, నరసింహారావు, ముర్తుజా, జాకీర్‌హుసేన్, శివ పాల్గొన్నారు.

ఓటు వజ్రాయుధం



ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

నంద్యాల(అర్బన్): ఓటు వజ్రాయుధం లాంటిదని, మన ఓటు ద్వారానే ప్రభుత్వాలు ఏర్పడి వాటి నిర్ణయాల ద్వారా మన జీవనం ఆధారపడి ఉంటుందని జేసీఎస్ జిల్లా కన్వీనర్ సన్నల సాయిరాంరెడ్డి తెలిపారు. ఓటరు నమోదు అవగాహన కార్యక్రమంలో భాగంగా బుధవారం స్థానిక 15వ వార్డులో ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థినులు, అధ్యాపకులతో ర్యాలీ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటు హక్కు పొందాలని కోరారు. వైఎస్సార్‌సీపీ నాయకులు సంపత్, సలాం, శ్రీరాములు, ప్రవీణ్ పాల్గొన్నారు.

రీసర్వే పూర్తి చేయండి

నంద్యాల: జిల్లాలో చేపట్టిన రెండవ దశ రీసర్వే పనుల ప్రక్రియను ఈ నెలాఖరులోపు పూర్తి చేయాలని సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ అధికారులు, మండల తహసీల్దార్లను జిల్లా కలెక్టర్ డాక్టర్ మనజీర్ జిలానీ శామూన్ అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి రీసర్వే, అసైన్‌మెంట్ భూములు, భూసేకరణ, ఓటర్ల జాబితా సవరణ తదితర అంశాలపై మాట్లాడారు. 76 గ్రామాలకు గాను 23 గ్రామాల్లో పూర్తయ్యిందని, మిగిలిన 53 గ్రామాల్లో నెలాఖరు నాటికి పూర్తి చేయాలని చెప్పారు.డీఆర్ఓ పుల్లయ్య, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ ఏడీ హరికృష్ణ పాల్గొన్నారు.

కేసీకి సాగునీరు విడుదల

నంద్యాల(సెంట్రల్): కేసీ కాలువ, తెలుగుగంగ ఆయకట్టు పరిధిలో సాగు చేసిన ఆరుతడి పంటలైన మొక్కజొన్న, పత్తి, కంది తదితర పంటలకు వారం పాటు నీటిని విడుదల చేయాలని నిర్ణయించినట్లు జిల్లా జలవనరుల శాఖాధికారి వెంకటరమణయ్య బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో తొందరపడి వరి సాగు చేయవద్దని, విడుదల చేసిన నీటిని ఆరుతడి పంటలకు మాత్రమే వినియోగించుకోవాలని అన్నదాతలకు సూచించారు. ప్రస్తుతం కేసీకి ముచ్చుమర్రి ఎత్తిపోతల, పోతిరెడ్డిపాడు హెడ్‌రెగ్యులేటర్ ద్వారా నీటిని విడుదల చేస్తున్నట్లు వెల్లడించారు.

శిరివెళ్లలో బిందె కలకలం



రోడ్డుపై ఉంచిన బిందె

శిరివెళ్ల: మండల కేంద్రంలో బుధవారం బిందె కలకలం రేపింది. రెడ్డిపేట నుంచి పొలాలకు వెళ్లే రస్తాలో ఓ సిల్వర్ బిందె ఉండడంతో ప్రజలు భయాందోళనకు గురయ్యారు. తెల్లవారిన తర్వాత పొలాలకు వెళ్లే రైతులు చూడగా.. బిందె చుట్టూ ఆకు పచ్చని గుడ్డ పేలిక కట్టి. చుట్టూ బియ్యం, రూపాయి నాణేలు ఉన్నాయి. మంగళవారం రాత్రి అమావాస్య కావడంతో క్షుద్ర పూజలు జరిగాయా అన్ని అనుమానాలు వ్యక్తమయ్యాయి.

రూ.5 కోట్లతో బీటీ రోడ్లు, వంతెనల నిర్మాణం



నేలంపాడు వద్ద రోడ్డు నాణ్యతను పరిశీలిస్తున్న డీఈ వెంకటసుబ్బయ్య

చాగలమర్రి: ఆళ్లగడ్డ సబ్ డివిజన్ పరిధిలోని చాగలమర్రి, రుద్రవరం, దొర్నిపాడు, శిరివెళ్ల మండలాల పరిధిలో రూ.5కోట్ల ఏఎంసీ, పీఎంజీఎస్‌వై నిధులతో బీటీ రోడ్లు, వంతెనల నిర్మాణాలు చేపట్టినట్లు నంద్యాల ప్రాజెక్టు డీఈ వెంకటసుబ్బయ్య తెలిపారు. బుధవారం ఎస్‌హెచ్-40 నుంచి నేలంపాడు గ్రామం వరకు రూ.1.3 కోట్ల ఏఎంసీ నిధులతో నిర్మించి, పూర్తయిన రహదారి నాణ్యతను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ఎస్‌హెచ్ 40 నుంచి కొండాపురం వరకు రూ.95 లక్షలు, కేపీ రహదారి నుంచి నందింపల్లె వరకు రూ.98 లక్షలతో బీటీ రోడ్డు, చాగలమర్రి నుంచి మహాదేవపురం వరకు రూ.80.30 లక్షలతో బీటీ రోడ్డు, పీబీజీ నుంచి బీరవోలుకు రూ.98.7లక్షలు ఖర్చు చేశామని చెపపారు. అలాగే ఇటీవల ఏఐబీ నిధులు రూ.4.8 కోట్లతో మండలంలోని చెంచుగూడెం వంతెన నిర్మాణం, పాంపల్లె రహదారి, వంతెన నిర్మాణానికి రూ.5కోట్లు ఖర్చు చేశామన్నారు. పీఎంజీఎస్‌వై నిధులు రూ.9.5కోట్లతో శిరివెళ్ల నుంచి చందలూరు రోడ్డు పనులు జరుగుతున్నాయని వివరించారు.

పేదలకు ఇళ్ల స్థలాలివ్వాలి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే శిల్పా రవి

నంద్యాల(న్యూటౌన్): పట్టణంలోని నిరుపేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని సీపీఐ నాయకులు పద్మావతినగర్ సెంటర్‌లో బుధవారం ధర్నా నిర్వహించిన అనంతరం వినతి పత్రాన్ని ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిశోర్‌రెడ్డికి అందజేశారు. సీపీఐ జిల్లా ప్రధాన కార్యదర్శి రంగనాయుడు బాబాఫక్రుద్దీన్ మాట్లాడుతూ పట్టణంలో 13,500 మంది ఇల్లు లేని నిరుపేదలను గుర్తించారని వారికి పట్టాలు ఇవ్వాలని కోరారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ అర్హుందరికీ ఇళ్ల స్థలాలు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. హరినాథ్, గోకారి, సుబ్బరాయుడు, శ్రీనివాసులు, ప్రసాద్, సోమన్న పాల్గొన్నారు.

పౌష్టికాహారం తీసుకోవాలి

నంద్యాల(అర్బన్): గర్భిణులు ప్రభుత్వం అందించే పౌష్టికాహారాన్ని తీసుకోవాలని నంద్యాల మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ అంకిరెడ్డి తెలిపారు. రక్త హీనత, గర్భస్రావాలు జరుగకుండా ప్రభుత్వం ప్రత్యేక చర్యలు .తీసుకుంటుందన్నారు. పట్టణంలోని గోపాల్‌నగర్ అంగన్‌వాడీ కేంద్రాన్ని బుధవారం ఆయన సందర్శించి బాలింతలు, గర్భిణుల ఆరోగ్య పరిస్థితులను తెలుసుకున్నారు.

అభివృద్ధికి సహకరించండి



మాట్లాడుతున్న ఎంపీపీ గజ్జల రాఘవేంద్రారెడ్డి

ఆళ్లగడ్డ: మండల అభివృద్ధికి ప్రతి ఒక్కరూ సహకరించాలని మండలాధ్యక్షుడు గజ్జల రాఘవేంద్రారెడ్డి కోరారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయం సమావేశ భవనంలో ఎంపీడీఓ మహబూబ్ ఖాన్ ఆధ్వర్యంలో బుధవారం సాధారణ మండల సర్వసభ్య సమావేశం జరిగింది. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన ఎంపీపీ మాట్లాడుతూ మండలంలో పక్కా గృహాల నిర్మాణాలు వేగవంతం చేసేందుకు ప్రజా ప్రతినిధులు, అధికారులు సమన్వయంతో చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రభుత్వం ప్రజా సంక్షేమం, అభివృద్ధి పనుల కోసం వేల కోట్ల రూపాయలు ఖర్చు చేస్తోందన్నారు. ప్రజలకు అందుబాటులో ఉండేందుకు సచివాలయాలు, ఆర్బీకేలు, విలేజ్ క్లినిక్‌లను ఏర్పాటు చేసిందని, సిబ్బంది బాధ్యతతో పని చేసి ప్రజా సమస్యలను పరిష్కరించాలని చెప్పారు. జగనన్న కాలనీలతో పాటు సొంత స్థలాల్లో ఇంటి నిర్మాణాలు చేపట్టిన వారికి ఉచితంగా విద్యుత్ మీటర్ ఏర్పాటు చేస్తామని ప్రభుత్వం చెప్పిందన్నారు. మీటర్‌తో పాటు సర్వీస్ వైర్, బోర్డ్, ఎంసీబీ, ఎర్త్ పైపు అందజేయడంతో పాటు అవసరమైతే స్తంభాలు కూడా ఉచితంగా అందజేస్తారని వివరించారు. ఉప మండలాధ్యక్షుడు నాసారి ప్రసాద్, మండల స్థాయి అధికారులు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి చెస్ పోటీలకు ఎంపిక

నంద్యాల(న్యూటౌన్): రాష్ట్ర స్థాయి చెస్ పోటీలకు నంద్యాల జిల్లా జట్టు ఎంపిక చేశామని నంద్యాల జిల్లా చెస్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ రవికృష్ణ తెలిపారు. బుధవారం పట్టణంలోని నెరవాటి ఇంగ్లిష్ మీడియం పాఠశలలో విజేతలకు బహుమతులు, పతకాలు, జ్ఞాపికలు, ప్రశంసా పత్రాలను అందజేశారు. రాష్ట్ర స్థాయి పోటీలకు హర్షవర్ధనాచారి, భానుతేజారెడ్డి, బాలికల విభాగంలో వెలుగోడుకు చెందిన దీక్ష, ఆళ్లగడ్డకు చెందిన రిషితా బాయిని ఎంపియ్యారని చెప్పారు. ప్రిన్సిపాల్ శివరామిరెడ్డి, ఐడీబీఐ మేనేజర్ శ్రీనివాసరావు, రామసుబ్బారెడ్డి, వ్యాయామ ఉపాధ్యాయులు అభినందించారు.

ఉత్తమ సేవలకు అవార్డు



నాగేశ్వరరావుకు అవార్డు అందజేస్తున్న దృశ్యం

నంద్యాల(న్యూటౌన్): విద్యా రంగంలో ఉత్తమ సేవలందించిన వై.నాగేశ్వరరావుకు ఎక్సలెన్స్-2023 అవార్డును అందజేశామని ఇమ్మానియెల్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు డాక్టర్ ప్రభు ఇమ్మానియేల్ మేనేజింగ్ ట్రస్టీ డాక్టర్ రత్న ఇమ్మానియేల్ తెలిపారు. బుధవారం భారతీ గ్రూప్ ఆఫ్ కళాశాలలో చైర్మన్ వై. నాగేశ్వరరావును ఘనంగా సన్మానించి అవార్డు అందజేశారు. ముఖ్య అతిథులుగా మాజీ మున్సిపల్ చైర్మన్ దేశం సులోచన, శిల్పా మహిళా సహకార్ చైర్మన్ శిల్పా నాగినిరెడ్డి హాజరయ్యారు.

విగ్రహ ఏర్పాటుకు అంగీకరించడంపై హర్షం

నంద్యాల(అర్బన్): బీఆర్ అంబేడ్కర్ విగ్రహాన్ని పద్మావతి నగర్‌లోని ఇండోర్ స్టేడియం ఆవరణలో ఏర్పాటు చేసేందుకు నంద్యాల జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్ అంగీకరించడంపై విగ్రహ, భవన నిర్మాణ కమిటీ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. విగ్రహాన్ని కలెక్టర్ ఆధ్వర్యంలోనే ఏర్పాటయ్యేలా చర్యలు తీసుకోవాలంటూ బుధవారం కమిటీ అధ్యక్షుడు మేకల లింగస్వామి ఆధ్వర్యంలో కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు.

రైతులకు అందుబాటులో ఉండండి

ఉయ్యాలవాడ : వ్యవసాయ శాఖకు సంబంధించి అన్ని పథకాలు రైతులకు చేరవేస్తూ వారికి అందుబాటులో ఉండాలని మండల వ్యవసాయాధికారి రాజేంద్రకుమార్ సూచించారు. బుధవారం మండలంలోని తుడుమలదిన్నె రైతు భరోసా కేంద్రానికి చేరిన రసాయనిక ఎరువులను పరిశీలించి సిబ్బందితో మాట్లాడారు. అలాగే మాయలూరు గ్రామంలో ఎరువులు, క్రిమి సంహారక మందుల దుకాణాలను తనిఖీ చేసి, రికార్డులు పరిశీలించారు. దుకాణాదారులు ప్రభుత్వం నిర్ణయించిన ఎమ్మార్పీకే మందులు విక్రయించాలన్నారు. రైతుల నుంచి ఫిర్యాదులు వస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.